
# హామీలిచ్చి మొండిచెయ్యి చూపించారు

- గడిచిన 10 ఏండ్లలో ప్రతి కుటుంబానికి బీఆర్ఎస్ సాయం
- 14 మాసాల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం


విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, చిత్రంలో క్యామ మల్లేశ్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 10 : అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని వైఎన్ఆర్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ అధ్యక్షతన సోమవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలిచ్చి మొండిచెయ్యి చూపించిందన్నారు. గత 10 ఏండ్లుగా ప్రతి కుటుంబానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏదో ఒక రీతిలో సాయం చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 మాసాలు గడుస్తున్నా ఒక్క కార్యక్రమమూ చేపట్టలేదని విమర్శించారు. గత 30 ఏండ్లుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి దూరంగా ఉన్న వ్యక్తులు ఇప్పుడు వచ్చి చేసేదేమీలేదన్నారు. వారి పని దోచుకొని దాసుకునుడే తప్ప మరొకటి ఉండదని ప్రజలకు తెలిసిన విషయమేనని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు విధానాలు, ఇగోయిజంతో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అబద్దాల కోరంటే అంతకంటే ఎక్కువ మా ఎమ్మెల్యే అని గుర్తు చేశారు. వారు ఎన్నికల ముందు చెప్పిన మాటలను నిరూపించుకునే పరిస్థితిలో లేరన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరికీ భయపడకుండా అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. గడిచిన ఐదేండ్లలో తాను చేసిన పనులకే ప్రారంభోత్సవాలు చేస్తూ గొప్పలు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా గ్రామాల్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లుగా గెలిచి తీరాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఆయా గ్రామాల బీఆర్ఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు.

భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలిచే దమ్మున్న వారే పోటీలో ఉండాలన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిన మాట వాస్తవమేనని.. ఇంట్ల కూసుంటే ఇబ్బందులు వస్తాయని కార్యకర్తలకు సూచించారు. మన పార్టీలో గెలిచి వేరే పార్టీలోకి పోయే కన్నా ఓడిపోయి కార్యకర్తలతో ఉన్నవాడు మంచివాడన్నాడు. కార్యకకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాంరెడ్డి, విఠల్‌రెడ్డి, జగదీశ్, ధనంజయ్యగౌడ్, పూజారి చక్రవర్తిగౌడ్, వీరస్వామియాదవ్, మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సాయికుమార్ గౌడ్, నాయకులున్నారు.


విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

# బర్డ్‌ఫ్లూ వ్యాధిపై జాగ్రత్త వహించాలి

**రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి**

**పౌల్ట్రీ యజమానులకు వెటర్నరీ అధికారులు అవగాహన కల్పించాలి**


ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, ఫిబ్రవరి 10 : పక్క రాష్ట్రంలో పౌల్ట్రీలలో బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకుతున్నందున జిల్లాలోని కోళ్ల ఫారాల యజమానులు తగు జాగ్రత్తలు పాటించేలా చూడాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెటర్నరీ అధికారులకు బర్డ్‌ఫ్లూపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని కోళ్ల ఫారాల యజమానులు గుర్తు కోళ్లు చనిపోతే వెంటనే సంబంధిత వెటర్నరీ దవాఖానలో సమాచారం అందించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించినందున జిల్లాలోని కోళ్ల ఫారాల యజమానులు తగు జాగ్రత్తలు చేపట్టేలా జిల్లాలోని వెటర్నరీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వెటర్నరీ అధికారులు కోళ్ల ఫారాలకు వచ్చినప్పుడు వారికి కోళ్ల ఫారాల యజమానులు సహకరించి వారికి ప్రతి సమాచారం అందించాలన్నారు. ఎక్కడైన కోళ్ల ఫారాల్లో ఎక్కువ మొత్తంలో కోళ్లు వ్యాధి సోకి చనిపోతే వాటిని పాతిపెట్టి, బయోకెమికల్ పౌడర్ చల్లాలని, ఇంకా పక్కన ఉన్న కోళ్లకు ఆ వ్యాధి సోకకుండా నివారించాలన్నారు. మన రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకినందున జిల్లాలో ని పౌల్ట్రీ యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి**

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి జిల్లా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో రెవెన్యూశాఖ-35, విద్యుత్-4, పీడీ హౌసింగ్-10, సర్వేలాండ్-4, మెప్మా-3, విద్య-5, డీపీవో-2, డీఆర్‌డీవో-4, మొత్తం 67 దరఖాస్తులు వచ్చాయని.. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు పంపించామని పేర్కొన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి**

ఇంటి స్థలాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ కందుకూరు గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కందుకూరు సర్వే నం.788, 107లలో 530 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలం పట్టా సర్టిఫికెట్‌లు ఇచ్చారన్నారు. కానీ ఇంతవరకు ప్లాట్ల నంబర్లు వేసి ఇవ్వకుండా లేఅవుట్ కూడా తయారు చేయలేదన్నారు. గతంలో అక్కడ గుడిసెలు వేసుకుని మేము నివసిస్తుండగా స్థానిక ఆర్డీవో, తహసీల్దార్ వచ్చి పోలీసుల సహాయంతో జేసీబీలు పెట్టి మా గుడిసెలను తొలగించారన్నారు. అప్పట్లో ఆర్డీవో, తహసీల్దార్ రెండు నెలల్లో సర్వే చేసి లబ్ధిదారులకు రోడ్లు వేసి ప్లాట్లకు నంబర్లు వేసి స్థలాలు చూపిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ చూపించలేదన్నారు. మూడు రోజుల క్రితం ఆర్డీవో, తహసీల్దార్ సర్వే చేశారన్నారు. వెంటనే స్థలాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు కోరారు.

# పనులు చేయకుంటే బిల్లులివ్వొద్దు

**ఎక్మాయి ఎంపీపీఎస్ హెచ్‌ఎంకు సూచించిన విద్యార్థుల తల్లిదండ్రులు**


పాఠశాలలో సమావేశమైన విద్యార్థుల తల్లిదండ్రులు

బషీరాబాద్, ఫిబ్రవరి 10 : మండల పరిధిలోని ఎక్మాయి మండల పరిషత్ పాఠశాల మరమ్మతుల కోసం అమ్మ ఆదర్శ పథకం కింద ప్రభుత్వం రూ.6.20 లక్షల నిధులను మంజూరు చేసింది. అధికారులు పనులను గ్రామ సమాఖ్య సభ్యులకు అప్పగించారు. ఈ నిధులతో పాఠశాల భవన మరమ్మతులకు రూ.4లక్షలు, విద్యుత్ సరఫరాకు రూ.50 వేలు, తాగునీటి కోసం రూ.లక్ష, మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.70వేలు ఖర్చు చేయాలి. అయితే సంబంధిత కాంట్రాక్టర్లు పనులను అసంపూర్తిగా చేసి బిల్లులు చెల్లించాలని హెచ్‌ఎంపై ఒత్తిడి చేశారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో సోమవారం పాఠశాలలో సమావేశమై పనులు పూర్తి చేస్తేనే బిల్లులు చెల్లించాలని హెచ్‌ఎంకు సూచించారు. ఇదే విషయాన్ని హెచ్‌ఎం పనులు చేసినవారికి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులెవ్వరు..? బిల్లులిచ్చేది మీరు.. తీసుకునేది మేము.. మధ్యలో వారెవరు అన్నట్లు బెదిరించే ధోరణిలో మాట్లాడడమే కాకుండా ఉన్నతాధికారులతో ఫోన్లు చేయిస్తున్నట్లు హెచ్‌ఎం సుప్రియ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా కాదనుకున్న కాంట్రాక్టర్లు గతంలో పీఆర్ ఏఈగా పనిచేసిన అధికారి పనులకు ఎంబీ రికార్డులు చేయడంతో వాటిని సదరు కాంట్రాక్లర్లు హెచ్‌ఎంకు చూపించడంతో అవాక్కయ్యారు. చేయని పనులకు రికార్డులు ఎలా చేశారని.. ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని వారితో తెలిపారు. మీకు రికార్డులు కావాలి.. మిగతా వాటి గురించి అనవసరం.. రికార్డులు తీసుకుని చెక్కు ఇవ్వాలని బత్తిడి చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. ఉన్నతాధికారులకు ఇక్కడి విషయం తెలియక బిల్లులు చెల్లించాలని ఫోన్లు చేస్తున్నారని, వారు వచ్చి విచారణ చేసేంత వరకు బిల్లులు ఇవ్వొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎంతో పేర్కొన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల కాస్మెటిక్ కోర్సులు

**డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి**


సింగపూర్ సెమినార్‌లో డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 10 : షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, ఫరూఖ్‌నగర్ మొగిలిగిద్ద జూనియర్ కళాశాల, రాజేంద్రనగర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కాస్మెటిక్ కోర్సులను నేర్పించేందుకు అబిస్ ఇన్‌స్టిట్యూట్ ముందుకొచ్చిందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సింగపూర్‌లోని సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో సస్టైనబుల్ ఇండియా భాగస్వామ్యంతో నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌కు వెళ్లడం జరిగిందని, తన అభ్యర్థన మేరకు మహారాష్ట్ర నాసిక్ కేంద్రంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రాన్స్‌లోని యూరోపియన్ అంతర్జాతీయ యూనివర్సిటీతో అసోసియేట్ కలిగి ఉన్న అబిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు కోర్సులను నేర్పించేందుకు ముందుకొచ్చిందని వివరించారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ సులభంగా పొందుతారన్నారు. కాస్మెటిక్స్‌పై ప్రయోగాలు నిర్వహించి అత్యంత సులభంగా అత్యధిక ఫలితాలు ఇచ్చే కాస్మెటిక్స్ తయారీ విధానం, వాడే విధానం, దాని ద్వారా ఉపాధి పొందేలా శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చిన ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి డాక్టర్ సకీనా పంజాబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందమైతే అంతర్జాతీయ సంస్థల కొలాబరేషన్‌తో ఎంఓయూ కలిగిన మొదటి విద్యాలయాలుగా షాద్‌నగర్ కళాశాలలు నిలుస్తాయని ఆయన తెలిపారు.

# హామీల అమలులో సర్కారు విఫలం

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్**

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : రైతులకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం అనేక హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్క హామీనీ అమలు చేయకుండా రైతులను నిండాముంచుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతు భరోసా ఏడాదికి 15వేల రూపాయలు ఇస్తామని ఆశపెట్టిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి 12వేలు మాత్రమే ఇస్తామని మాటతప్పారని వివరించారు. ఇటీవల నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని గ్రామసభలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఒక పథకం కూడా అమలు చేయలేదన్నారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతతోనైనా అమలు చేయాల్సిన ప్రభుత్వం వాటిని పట్టించుకోవడంలేదన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. కనీసం ఆ గ్రామంలోనైనా 10 శాతం రైతులకు మాత్రమే భరోసా వచ్చిందని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవపట్టించిన కాంగ్రెస్‌కు రైతులు, ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. సోమవారం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించిన రైతు సదస్సుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రావడంతో వేలాది మంది రైతులు బీఆర్ఎస్ నాయకులు తరలివచ్చి విజయవంతం చేశారని హర్షం వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేకి కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తాకుతుందన్నారు. రైతులకు ఇప్పటికైనా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఇండియా ఆర్ట్ ఫెయిర్

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 10 : ఇండియా ఆర్ట్ ఫెయిర్ 2025లో భాగంగా సాల్వడోర్ దాలి ఆర్ట్ ప్రదర్శన ఢిల్లీలో నిర్వహించారు. క్రిస్టీన్ ఆర్జిలే క్యురేషన్‌లో ఇండియా హాబిటాట్ సెంటర్‌లో విజువల్ ఆర్ట్స్ గ్యాలరీలో ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కళాకారులు, విద్యావేత్తల బృందం ప్రఖ్యాత సుర్రియలిస్టు కళాకారుడు సాల్వడోర్ డాలి అరుదైన కళా ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ఇండియా ఆర్ట్ ఫెయిర్ 2025 ద్వారా అంతర్జాతీయ, ఆధునిక భారతీయ కళా సమగ్ర అనుభవాన్ని పొందే అవకాశం లభించిందన్నారు.

# వ్యక్తిని హత్య చేసిన నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష


నర్సింహులు

షాబాద్, ఫిబ్రవరి 10 : స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటనలో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. 2021లో షాబాద్ మండలంలోని లక్ష్మారావుగూడ గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో మునిరి రమేశ్, నర్సింహులు కలిసి మరొక వ్యక్తిని హత్య చేశారు. అప్పట్లో వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తర్వాత మునిరి రమేశ్ మృతిచెందాడు. నేరం రుజువు కావడంతో నర్సింహులుకు పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.15వేలు జరిమానా విధిస్తూ సోమవారం ఎల్బీనగర్ అదనపు కోర్టులో న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో అప్పటి సీఐ అశోక్‌తోపాటు ప్రస్తుత సీఐ కాంతారెడ్డి, రఘు, సత్యనారాయణ, సిబ్బంది వెంకటేశ్, అనీఫ్, ప్రభాకర్, జంగయ్యల కృషితో నేరం నిరూపితం చేయడం వల్ల ఈ కేసులో న్యాయమూర్తి తీర్పులో నిందితుడికి జైలు శిక్ష ఖరారైనట్లు సీఐ తెలిపారు.

# మోతాదు మించితే అనర్థాలే..!

## అదుపులేని మందుల పిచికారీతో నష్టాల బాటలో అన్నదాతలు

యాసంగి సీజన్‌లో పంటల సస్యరక్షణ చర్యలు తీసుకుని, పంట ఆరోగ్యంగా పెరిగేలా చేయడమే లక్ష్యంగా రైతులు ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నది. వరి, మొక్కజొన్న, కంది, పప్పుదినుసులు, వేరుశనగ తదితర పంటలు ఏపుగా పెరిగే సమయంలో ఎరువులతోపాటు పురుగుల మందులను కూడా వాడాల్సి ఉంటుంది. పంట సాగు చేసినప్పటి నుంచి పెరిగే, కోత దశలో కూడా పురుగు, తెగుళ్లు సోకుతాయి. ఈ సమయంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని మందులు వాడితేనే మంచి ఫలితాలు, దిగుబడులు వస్తాయి. కానీ, రైతులు ఎరువుల దుకాణాల యాజమానులు, పక్క రైతుల సలహాలు తీసుకుని మాత్రమే ఎరువులు, పురుగుల మందులు వాడుతున్నారు. దీంతో ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. తెగులు ఒకటైతే మరొక పెస్టిసైడ్‌ను వాడటం, మోతాదుకు మించి వాడటంతో దిగుబడుల్లో తేడాలు వస్తుంటాయి. ప్రతి సీజన్‌లో రైతులు ఇటువంటి పొరపాట్లు చేస్తూ పంట నష్టపోవడం చూస్తూనే ఉన్నాం. ముఖ్యంగా పురుగుల మందుల కొనుగోలు నుంచి వాటిని పంటలపై పిచికారీ చేసేంత వరకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమున్నదని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

- ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10



### మందులు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

* పురుగు మందులు కొనుగోలులో దుకాణదారుడి లేదా పక్క రైతుల సూచనలు పాటించడం మానేయాలి.
* పంటకు ఆశించింది పురుగా లేదా తెగులా పోషకాహార లోపమా.. అనే విషయాలను నిర్ధారణ చేసుకుని మాత్రమే పురుగుల మందును ఎంపిక చేసుకోవాలి. లేకుంటే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.
* పురుగుల మందును అనేక వ్యాపార సంస్థలు వేర్వేరు పేర్లతో తయారుచేసి విక్రయిస్తారు. సాధారణ పేర్లతోపాటు వ్యాపార నామాలు కూడా రైతులు తెలుసుకోవలసిన అవసరమున్నది.
* పురుగు మందుల డబ్బాపై త్రిభుజాకారంలో ఒక రంగు ఉంటుంది. ఎరుపు రంగు ఉంటే అత్యధిక విషపూరితం, పసుపు రంగు ఉంటే అధికం, నీలం రంగులో ఉంటే మధ్యస్థం, ఆకుపచ్చ రంగు ఉంటే స్వల్ప విషపూరితమని తెలుసుకోవాలి.
* రైతులు వ్యవసాయశాఖ నుంచి లైసెన్స్ పొందిన కంపెనీలు, దుకాణాల నుంచి మాత్రమే పురుగుల మందులు కొనుగోలు చేయాలి.
* కొనుగోలు చేసిన ప్రతి పురుగుల మందుకు విధిగా బిల్లు తీసుకుని భద్రపర్చుకోవాలి.
* పురుగుల మందు డబ్బాలపై గడువు తేదీని విధిగా చూడాలి. గడువు తీరిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదు. డబ్బాలకు మూతలు సరిగ్గా ఉన్నాయా లేదా ముందుగానే చూసుకోవాలి. లీకేజీ ఉన్న డబ్బాల్లోని పురుగుల మందు నాణ్యతను కోల్పోయే ప్రమాదమున్నది.
* ఆహార పదార్థాలను, పురుగుల మందులను ఒకేసారి కొనుగోలు చేయకూడదు. రెండింటినీ ఒకచోట నిల్వ ఉంచరాదు.
* పురుగుల మందులను ఇంటిలో కాకుండా వ్యవసాయక్షేత్రంలో ప్రత్యేక స్థలంలోనే భద్రపర్చుకోవాలి.

### ఎలాంటి స్ప్రేయర్లు వాడాలి

రైతులు తమ పంటపొలాల్లో క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేందుకు వివిధ రకాల స్ప్రేయర్లు వాడుతారు. ఇందులో పవర్, కంప్రెషర్ స్ప్రేయర్లు ఉంటాయి. పవర్ స్ప్రేయర్ల వాడకంలో మందు వినియోగం ఎక్కువ. నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. వీటి ద్వారా స్ప్రే చేస్తే పంటలోని ప్రతి భాగంపై మందు పడి పురుగులు, తెగుళ్లు తొందరగా చనిపోయే అవకాశం ఉంటుంది. కంప్రెషర్ స్ప్రేయర్లతో పిచికారీ చేసినప్పుడు చిన్నచిన్న తుంపర్లుగా మాత్రమే పంటపై పడుతుంది. పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తే పొగలాగా వ్యాపించి ప్రతిచోటా పడుతుంది. రైతులు పవర్ స్ప్రేయర్లకే ప్రాధాన్యతనిస్తే మంచిది. అకేలా స్ప్రేయర్లు, చేతి పంపులు, కంప్రెషర్ పంపులతో ప్రయోజనం తక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

### మందులు ఎక్కువగా అవసరమయ్యే పంటలు


వాణిజ్య పంటలతోపాటు కూరగాయల పంటలకు ఎక్కువగా పురుగుల మందులను వాడుతారు. ముఖ్యంగా వరి, పత్తి, మిరప, వేరుశనగ, కంది, పొగాకు, బెండ, కాలీఫ్లవర్, క్యాబేజీ తదితర పంటలకు క్రిమిసంహారక మందులు అవసరం ఎక్కువగా ఉంటుంది. కూరగాయల సాగులోనూ పురుగుల మందు అవసరం ఉంటుంది. కూరగాయలు, ఆకుకూరల పంటలపై మోతాదుకు మించి పెస్టిసైడ్స్ వాడితే ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం ఉంటుంది.

### ఆరోగ్యంపై క్రిమి సంహారక మందుల ప్రభావం అధికం

పురుగుల మందుల వాడకం మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. పురుగుల మందుల ప్రభావానికి గురైన వాళ్లలో ప్రత్యుత్పత్తి, పెరుగుదలలో మార్పులు సంభవించడం హైపర్ యాక్టివిటీ, శరీర భాగాల మధ్య సమన్వయ లోపం, ఊపిరి తీసుకోవడం కష్టంగా మారటం, వికారం, వాంతులు, విరేచనాలు స్పృహ కోల్పోవడం లాంటివి జరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

- పురుగుల మందుల్లో రకాలు గుర్తించాలి
- తెగులుకు అనుగుణంగా వాడుకోవాలి
- పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు అవసరం
- మందుల వాడకంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరి

### మోతాదుకు మించి వాడితే పంటలకు తీరని నష్టం



క్రిమిసంహారక మందులను మోతాదుకు మించి వాడితే పంటకు నష్టం. అవసరమైనంత మేరకే వాడాలి. పురుగుల మందులను ఎంత తక్కువగా వాడితే అంత మంచిది. వీటివల్ల భూమిలోని సారం తగ్గిపోయి భవిష్యత్తులో పంటలు పండే అవకాశం ఉండకుండా పోతుంది. మందులు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు అవసరం. పంటకు ఏ తెగులు వచ్చిందో నిర్ధారించుకుని అందుకు తగిన మందును ఎంపికచేసుకుని మాత్రమే ఉపయోగించాలి. పురుగుల మందును కలిపేటప్పుడు కూడా కొలతను విధిగా పాటించాలి. అప్పుడే పంట ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయి.

- శ్రవణ్‌కుమార్, ఏఈవో ఇబ్రహీంపట్నం

### పిచికారీలో జాగ్రత్తలు..

* పురుగుల మందు ద్రావణాన్ని చేతితో కలుపకుండా గ్లౌజులు వేసుకుని, కర్రతో మాత్రమే కలపాలి.
* పురుగుల మందు డబ్బాపై ఉన్న టేబుల్‌లో వివరాలను పూర్తిగా చదవాలి. అందులో సూచించిన విధంగా మాత్రమే మోతాదు ప్రకారం పురుగు మందును, నీటిని కలిపి పంటలపై పిచికారీ చేయాలి.
* రెండు, మూడు మందులను కలిపి వాడేటప్పుడు వాటి కలయిక జరుగుతుందా, లేక ఏమైనా అనర్థం జరుగుతుందా అనే విషయాన్ని తెలుసుకున్నాకే వాడాల్సి ఉంటుంది.
* మందును పిచికారీ చేసేటప్పుడు విధిగా మూతికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించాలి.
* పిచికారీ చేసేటప్పుడు గంజిపెట్టిన దుస్తులు ధరించాలి. మందు అవశేషాలు దుస్తులపై పడినా ఆరోగ్యంపై ప్రభావం చూపదు.
* పురుగుల మందులను చల్లని వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే పిచికారీ చేయాలి. అంటే ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే చల్లాలి. తీవ్రమైన ఎండలో గానీ వర్షంలో గానీ పిచికారీ చేయరాదు.
* నిపుణులు సిఫార్సు చేసిన మోతాదులో మందు పరిమాణాన్ని సరిగ్గా కొలిచి నీటితో కలపాలి.
* గడ్డి మందుతో పురుగుల మందు కలిపి స్ప్రే చేయరాదు.
* మందు స్ప్రే చేసే సమయంలో ఆహార పదార్థాలు, పానీయాలు గానీ సేవించరాదు. మందు పిచికారీ పూర్తయ్యాక స్నానం చేసిన తర్వాత మాత్రమే తినటం, సేవించటం చేయాలి.
* ఏదైనా సమయంలో పురుగుల మందు వల్ల హాని జరిగినట్లు అనిపిస్తే వెంటనే దగ్గరలోని వైద్యున్ని సంప్రదించాలి.
* పురుగుల మందులను పిల్లలకు, పశువులకు దూరంగా ఉంచాలి. చిన్నపిల్లలతో పిచికారీ చేయించరాదు.
* మందు పిచికారీ చేశాక డబ్బాలను భూమిలో పాతిపెట్టాలి.